గుంటూరు ప్రయాణం

అసలు నేను ఎక్కడికీ ప్రయాణం చేసేవాడిని కాను. ప్రయాణం అంటే అయిష్టం గలిగింది. దానికి ఒక చిన్న కారణం ఉంది. నేనూ అందరిలాగా అందంగా ఉండవలెనని చూస్తూ ముందు జుట్టు ముచ్చటగా దువ్వుకొని పైన పట్టుకండువా వేసుకోందే బయటకి రాను. నేను వీధివెంట వెడుతూ ఉంటే వాకిళ్లలో చక్కగా ఆడుకుంటున్న పిల్లలు నన్ను విపరీతంగా కళ్ళు ఆర్పకుండా చూసి, కెవ్వున కేకలేసి ఇళ్ళల్లోకి పరుగెత్తుతారు. మా అక్కయ్య కూతురు కూడా నన్ను జూచి 'బూచివాడు బుయ్యిస' అంటుంది. వీళ్ళ కళ్ళకు నేను ఏమి లాగా కనపడతానో? నేనేమైన అరవవాడిలాగ కనిపిస్తానా ఏమి మళ్ళీ. ఏమిటో మరి! బజారున కెడుతూ ఉంటే ఆంబోతు ఎద్దు నన్ను చూడటంతోనే సాధారణంగా పొడవ వస్తుంది. అది సాత్వికమైన జంతువు. పిల్లల దగ్గరకెళ్లినా ఏమీ అనని జంతువు. నన్నుజూచి పొడవరావటానికి ఏదో కారణం ఉండక మానదు గదా? కారణం ఫలానా అని నేనేమి చెప్పేది.

వీధివెంట అటూ ఇటూ చూస్తూ సరదాగా వెళ్లే ప్రాప్తం లేదు. ప్రతి జంతువు నన్ను జూచి బెదిరిపోతుంది! ఆడవాళ్ళు బెదిరారంటే పోనీ అదేదో వాళ్ళకు సహజగుణం అనుకోవచ్చు. కోడిపెట్ట నన్నుజూచి బెదిరి నన్ను తరిమితే నేనేమనుకోవాలి?

ఇంతకూ అది నా జాతకఫలం నన్ను ఎవ్వరూ సరిగా అర్థం చేసుకోలేరు. ఈ మధ్య కొంచెం సరదాపడి గిరజాలు పెట్టించాను. అవి బాగా పెరిగిన తరువాత అందంగా ఉన్నవి. మొఖాన వున్న స్ఫోటకం మచ్చల వల్ల అందానికి వచ్చిన లోపం దీనితో పోయిందని అనుకొన్నాను. ఒక రోజున గిరజాలు చాలా అందంగా దువ్వుకొని హెజ్‌లైన్ స్నో (Hazline snow) మొఖాన రుద్ది సిల్కుకండువాపైన వేసుకొని బయలుదేరాను. ఆ రోజున ఎందుకో మహా కులాసాగా ఉంది. నేను వెడుతూ ఉండగా ఒక పెద్ద మనిషి నన్ను వెనుకనుంచి కేకలేసి పిలిచాడు. ఎవరో పెద్దమనిషి గదా అని ఆగి "ఎందుకండీ" అన్నాను. అతడు "ఏమోయ్! నిన్న మీ అన్నయ్య కాబోలు అతడు నీ మోస్తరే ఉంటాడు. మా యింట్లో పరుపు కుట్టడానికి ఒప్పుకొని

రేపు వస్తానని చెప్పి మళ్లీ రాలేదు. రేపు తప్పక రమ్మని చెప్పుమీ" అని వెళ్లిపోయినాడు. నాకు అరికాలు మంట తలకెక్కింది. నేను దూదేకుల సాహేబు తమ్ముడినా! బుఱ్ఱ చితుకకొడుదామని అనుకొన్నాను. ఇంతలో అతడు వీధి మలుపు తిరిగి జనంలో అదృశ్యుడైనాడు. నా సమీపంలో ఉంటే ఏమి జరిగేదో!

అసలు రైలు ప్రయాణం అంటే ఎందుకు ఇష్టంలేదోచెప్పబోయి ఇదంతా ఉపోద్ఘాతం కింద చెప్పాను.అసలు విషయం చెబుతాను. ఒక మాటు రైలులో ప్రయాణానికి బెజవాడలో ఎక్కాను. నేను ఎక్కిన పెట్టెలో ఒక అరవదేశపు స్త్రీ తన పిల్లలు కాఫీ డబ్బాపెట్టుకొని కూర్చున్నది. నేను ఎక్కీ ఎక్కడంతోనే ఆమె చంటిపిల్లవాడు నావంక వెఱ్ఱి చూపులు చూచి కెవ్వున కేకేసి తల్లి ఒడిలో విరుచుకుపడ్డాడు. నాకు చెడ్డకోపం వచ్చింది. అది వరకు దారా ఆడుకుంటున్నవాడు నన్ను జూసీచూడడంతోనే విరుచుకుపడటానికి నేనేమైనా పెనుభూతాన్నా? పోనీలే అరవ వెధవ అని ఆ బండిలోనే ఎక్కి కూర్చున్నాను. పిల్లవాడు ఒక్క తీరున గుక్కబట్టి ఏడ్వటం మొదలుపెట్టాడు. తల్లి ఎన్నో విధాల సముదాయించాలని చూచింది. ససేమిరా వాడు వినడు. ఆమె పాపం కాఫీ యిచ్చింది. బిస్కట్టు పెట్టింది. ఏమేమో పెట్టి వాడ్ని మరిపించాలని చూచింది. కాని ఏమీ లాభం లేకపోయింది. వాడు ఊరికే నావంక దిగాలపడి చూడనూ, ఏడవనూ! ఆమె విసిగిపోయి ఆఖరుకు "ఏమో నాయనా ఎవరిని చూచి జడుసుకొన్నావో, ప్రతివాళ్లు ఆడవాళ్లూ ఉన్నారని లేదు, పసిపిల్లలున్నారనిలేదు, ఇష్టంవచ్చినట్లు బండిలోకి పాకుతారు" అని నా వంక చూస్తూ అన్నది. నాకూ విసుకు పుట్టి ఏలూరులో దిగిపోదామని ప్లాట్‌ఫారం మీద కాలుపెట్టానో లేదో వాడప్పుడే ఏడ్పు చాలించి నవ్వటం మొదలు పెట్టాడు. అందుకని నేను సాధారణంగా రైలులో ప్రయాణం చెయ్యటం మానుకున్నాను. కాని ఆ రోజు తప్పనిసరిగా ప్రయాణం చెయ్యవలసి వచ్చింది. మా బావ నన్ను తక్షణం బయలుదేరమని ఈ విధంగా వ్రాశాడు.

"నీవు యీ ఉత్తరం చూచిన తక్షణం స్టేషనుకు వెళ్లి అంటే పోలీసు స్టేషనుకు కాదు రైలు స్టేషనుకు, టికెట్టుకొని గుంటూరులో దిగి బండిమీద (N.B. రైలుబండి మా యింటిదాకా లేదే అని దిగులుపడబోకు. నా ఉద్దేశ్యం జట్కా మీద టాపుమీద ఎక్కి కూర్చునేవు లోపలే కూర్చో) మా యింటికి యకాయకినిరా".

ఈ ఉత్తరం చూచుకొని నీ తెలివికి సంతోషించాంలే అని వ్రాయాలనుకొని పోనీ, వెళ్లుతున్నాంగదా! అనేది ముఖం ఎదుట అందామని బయలుదేరాను.

మర్నాడు ప్రయాణం కాబట్టి ఆ రోజునే బట్టలు సర్దుకొన్నాను. తెల్లవారక పూర్వమే లేచి స్నానముకేసి బయలుదేరాను. ముత్తైదువులు ఎదురుగా వస్తే మంచి శకునం అంటారు. ఏ ముత్తైదువైన ఎదురుగా వస్తున్న నన్ను జూచి బెదిరి మరోదారిని పోవటం నా అనుభవంలో విషయమే. నా భార్య మంచి ముత్తయిదువే కాబట్టి ఆవిడనే ఎదురుగా రమ్మని గుమ్మందాటిన తరువాత జట్కావాడిని వేగిరం రమ్మన్నాను. వాడు వచ్చి

"ఏవూరండి బాబు పయానం కట్టారు" అన్నాడు.

"గుంటూరుదాకానోయి" అన్నాను.

"ఓస్ గుంటూరుబండి కండీ!" ఏ బండో అనుకొని గుర్రంతినే దాణా తీసివేసి వచ్చాను. అరగంట ఆలస్యంగా వెళ్లినా ఫరవాలేదు. దయచేసి మీరు కాఫీ పుచ్చుకొంటూ ఉండండి".

అనివాడు నన్ను హొటలులోకి పంపి వెళ్లిపోయినాడు. దాణా తిన్న తరువాత వచ్చి నన్నెక్కించుకొన్నాడు. అప్పటికే రైలు కదిలే టైం అయినది. బండి అందదని మనస్సులో అనుకొని "సరేపోనీ నువ్వే తీసుకొద్దుగానిలే మళ్లీ" అని వాడితో అన్నాను.

బండి ఫ్లాటుఫారంమీద ఉంది. నేను టికెట్టు కొనుక్కొనే నిమిత్తం వెళ్లాను. ఒకాయన ఆ గూట్లో చేయిబెట్టి "ఏమండోయ్ టీ ఇయ్యండి. గుంటూరులో యాజ్యం తలపెట్టాను" అంటున్నాడు. నీవు ఎందుకు వెళ్లుతున్నది. ఆయనకు చెప్పనవసరంలేదు. అని నేను అంటుంది నా మాటలు వినిపించుకోకుండా అతడు రెండు మొగటికేట్ ఒక ఆడటికెట్టు యివ్వమన్నాడు. నాకు నవ్వొచ్చి, ఆడ టిక్కట్లు మొగటిక్కట్లు ఏమిటయ్యా" అన్నాను. ఆడబండ్లూ మొగబండ్లూ ఉన్నప్పుడు టిక్కెట్లు ఎందుకుండవంటూ అతడు వెళ్ళిపోయినాడు.

నేను వెళ్లి "గుంటూరుకు ఇంటరుమీడియట్ టిక్కట్టు యివ్వండి" అన్నాను. అతడు నా వంక ఎగాదిగా చూచాడు. ఆ చూపులు వింతగా ఉన్నవి, "నీకా టిక్కెట్టు?

ఇంకెవరికైననా? నీవెప్పుడైనా యింటరు టిక్కట్టు కొన్నావా? ఇదే మొదటిసారి కొంటున్నావా? ఇంటరు టిక్కట్టే కొంటే ఎంత అవుతుందో తెలుసునా?" అని అర్థం వచ్చే చూపులు చూశాడు.

ఇటువంటి చూపులు అర్థం చేసుకోవటం నాకు కొంచెం అలవాటే. కూరల దుకాణం దగ్గరకు వెళ్ళి "వంకాయలు ఎలా యిస్తున్నావయ్యా" అని అడిగితే "సవాశేరు మూడు అణాలు" అంటాడు. మూడు అణాలు విపరీతమైన ధర అని నేను వేరే చెప్పనక్కరలేదు. సాధారణంగా ప్రియంగా అమ్మే రోజులలో సయితం సవాశేరు అణాకు యిస్తారు. అయినా మరీ ప్రియంగా వున్నాయేమో అని అణాకు అడిగితే బాగుండదనుకొని "అణాన్నరకు యిస్తావా లేదా" అని అనేసరికి వాడు "ఏమయ్యా యింత తెలివితక్కువగా మాట్లాడుతావేమి? వంకాయలు ఎప్పుడన్నా కొని తిన్నావా? నీకు ధరల విషయమై బొత్తుగా తెలియని అడివిమనిషిలా ఉన్నావే?" అని తాత్పర్యం వచ్చే చూపులు చూస్తాడు. "నీవు ఏమయ్యా అలా చూస్తావు? వంకాయలైనా ఏమంత బాగుండలేదు కనరెక్కిన వంకాయలలా ఉన్నాయిగా" అని నేననేసరికి ఇవా కనరెక్కిన వంకాయలు అని పెద్ద అరిచి ఒక రకం చూపులు చూస్తాడు. నేను అంత వెర్రివెంగళప్పగా నయినట్టు నా అంత బుద్ధిహీనుడ్ని అతడు యీ విశాలమైన ప్రపంచంలో ఎప్పుడూ ఎక్కడ చూడనట్టూ భావం ప్రకటించే వింత చూపులు చూస్తాడు. ఇటువంటివి నాకు రోజూ అనుభవంలోనివే. అందుకని అట్టి చూపులు మాటలలోకి తర్జుమా చెయ్యడంలో నాకు కొంచెం పరిశ్రమ ఉంది.

ఆ టెక్కట్లు అమ్మే ఆయన అటువంటి చూపులు చూచినప్పుడు, నాలో నేను "నీకు కూడా పుట్టింది, యీ వికారం. అని అనుకొని టిక్కట్టు యివ్వండి. చూస్తారేం అన్నాను.

"ఈ బండిలో ఇంటరుమీడియట్ క్లాసు లేదని తెలియదా" అని అంతటితో ఊరుకోక సెకండుక్లాసు యివ్వనా అని ఒక కన్నుమూసి ఒక కన్ను తెరిచి వెకిలి నవ్వు నవ్వాడు. కోపం వచ్చింది. కాని వాడితో వాదనలోకి దిగితే బండి అందదేమో అని భయపడి "వెధవ గుంటూరు బండిలో ఇంటరు క్లాసు ఉండదు" అని విసుక్కొని థర్డ్‌క్లాసు యివ్వండి అన్నాను. టిక్కెట్టు పుచ్చుకొని గేటులో వాడు ఎవ్వరితోనో

మాట్లాడుతుంటే వాడిని పిలిచి బతిమిలాడి టిక్కట్టు కత్తిరించుకొని తరువాత ఫ్లాటుఫారం మీదికి వెళ్లాను, వెంటనే బండిలో ఎక్కి కూర్చున్నాను.

అప్పటికే బండి కదలవలసిన టైము అయిపోయి పావుగంట అయింది. ఇక ఒక నిమిషంలోనో అరనిముషములోనో బండి కదులుతుందనుకొని పరుగెత్తుకుంటూ వెళ్ళి బండిలో కూర్చున్నాను. కాని ఎంతసేపటికి బండి కదలదు. ఏమిటి చెప్మా అని విచారించగా గార్డు భోజనం యింకా కాలేదని తెలిసింది. మరో పావుగంటలో ఆయన భోంచేసి బొఁర కదుపుకుంటూ వచ్చాడు.

2

ఫ్లాటుఫారం మధ్యగా నుంచుని అటూ ఇటూ దేనికోసమో చూడడం మొదటుపెట్టాడు. గార్డు, గ్రీకు పురాణాల్లో "జేసినను ప్రయాణాలు" అని ఒక ఘట్టము ఉంది. అతడు (బంగారు ఉన్నికై) ఒక వింత దేశానికి వెళ్ళుతున్నప్పుడు అతనితో అనేక మంది పండితులు, గాయకులు, శిల్పులు వెళ్ళారు. అందులో ఒకాయన ఎంతదూరపు వస్తువులైనా జూడగలడు, కాని తన కాళ్ళక్రింద దగ్గరలోనున్న వస్తువును మాత్రము చూడలేడు, అని చదివినప్పుడు నాకు ఎంతదూరపు వస్తువులైనా ఎలా కనపడుతుందా అని సందేహము కలిగి మా పంతులుగారిని అడిగితే ఆయన అతడు బహుశః భూతద్దపు సహాయము వలన చూడగలిగియుండును అని సమాధానము చెప్పినాడు. అయితే కాళ్ళముందు వస్తువులను ఏల చూడలేడు అని అడిగితే మా మాస్టరుగారు జవాబు చెప్పలేకపోయినారు. ఇప్పుడు నాకు దానికి సమాధానం ఈ గార్డును చూచేసరికి స్ఫురించింది. ఈ గార్డుకు అంత పెద్ద బొఁర ఉండటంవల్ల దూరం కనిపించినా తన కాళ్ళ ముందు వస్తువు బొత్తిగా కనిపించదు. మధ్య బొఁర పర్వతం అడ్డం.

దేనికో యిల్లా చూస్తాడు. అని అనుకొంటూ ఉండగానే అతడు దీని దుంపతెగ. ఈ బండి దగ్గర ఒక పోర్టరు వెధవ అయినా కనిపించడు" అని విసుక్కొన్నాడు. కాసేపు అక్కడే నిల్చుని ఒక పోర్టరు కనిపించటంతోనే వాడిని రమ్మని పిలిచినాడు.. కాని వాడు "కొంచెం ఉండవయ్యా వస్తాను ఆ గార్డు పిలుస్తున్నాడు" అని తెనాలిబండి

వైపు పోయినాడు. చిన్నబండి గార్డు అంటే పోర్టర్లకు కూడా అలుసు కామోలు. అని నాలో నేను నవ్వుకొన్నాను. వాడు మళ్లీ పదినిముషాలలో వచ్చాడు. గార్డు వాడిని పిలిచి "ఒరే నువ్వు ఈ పచ్చ జెండా ఊపు, బండి కదిలే లోపల ఇంటికెళ్ళి కొంచెం తొందర పని చూచుకొని అటువచ్చి గేటుదగ్గర ఎక్కుతా" నన్నాడు. ఆ మాటలు విని నేను ఇది రైలుబండే గదా ఇంత ఆలస్యంగా కదులుతుంది. మీరు ఊపినప్పుడే దిక్కులేదు. నేను జండా ఊపితే బండి కదలుతుందా" అన్నాడు. గార్డు "ఊపవోయి" అని వెళ్ళిపోయినాడు.

పోర్టరు మొఖం ముడుచుకుని పచ్చజెండా ఊపటం మొదలుపెట్టాడు. డ్రైవరు ఏదోపనిమీద ఉన్నాడు కాబోలు యిది చూడలేదు. పోర్టరు జండాను విసిరి విసిరి ఊపాడు అప్పటికి లాభించనందున విసుగుపుట్టి జండాను గట్టిగా నాలుగుసార్లు నేలకేసి కొట్టుతూ "ఇదెక్కడి మేళం తెచ్చిపెట్టిపోయినాడు నాకు గార్డు" అని విసుక్కొన్నాడు. ఆఖరుకు పెద్దగా డ్రైవరును పేరుపెట్టి పిలిచినాడు. నేను కిటికీలో నుంచి తొంగిచూచి ఏమిటోయి అన్నాడు. "ఏమిటండీ చూస్తున్నారు కేక అందుకోని వాడిని ఇటు పిలవండి బాబూ అన్నాను. మా ఉభయుల ప్రయత్నాలు ఫలించలేదు. చివరకు పోర్టరు ఆ జెండా అక్కడ పారేసి చకాచకిన స్టేషను మాస్టరు దగ్గరకు వెళ్ళి "ఎంతసేపు జండా ఊపినా డ్రైవరు చూడడు. అజాగ్రత్తగా ఉన్నాడు" అని చెప్పాడు. డ్రైవరుకు పోర్టరుకు అదివరకు విరోధం. ఈ దెబ్బతో డ్రైవరు ఉద్యోగం ఊడుతుంది అనుకొన్నాడు. కాని స్టేషను మాస్టరు "ఏడ్చావులే పో, గుంటూరు బండికి తొందరేమిటి? అన్నాడు. వీడు చేసేది ఏమి లేక సరిగా ఇంజను దగ్గరకు వెళ్ళి, తల దువ్వుకొంటున్న డ్రైవరు జండాతో కొట్టి ఈసారి అయినా చూసి ఏడవవోయి" అని చెప్పి ఇంజనుకు ఎదురుగా నుంచోని పచ్చజెండా ఒకేమయిన ఊపాడు.

అప్పుడు డ్రైవరు లేచి బహు ప్రయాసంమీద కూతవేయించాడు, అంతా బండి ఎక్కారు గాని మా పెట్టె దగ్గర ఇద్దరు స్కూలు కుర్రాళ్ళు కింద షికారు చేస్తున్నారు. అందులో ఒకడు "ఒరే బండి కూతేసిందిరా? అన్నాడు. ఓసీ ఈ నాయనమ్మ బెదిరింపులకేమిలే" అన్నాడు.

అక్కడ డ్రైవరు మర తిప్పాడు. బండికేమాత్రం చలనం గలుగలేదు. స్కూలు

కుర్రాడు "నేను చెప్పలేదూ ఇది గర్భిణీ స్త్రీరా" అని గట్టిగా నవ్వాడు. ఆవిరి సరిగా ఎక్కటం లేదనుకొని డ్రైవరు బలంకొద్దీ మరలు తిప్పాడు. బుస్సున ఆవిరి పోవటమే గాని బండి కదలదు. అతడు ఆఖరుకు ప్రబల ప్రయత్నం మీద మళ్ళీ కూతకూయించాడు. నా ప్రాణాలు కొంచెం కుదుటపడ్డాయి. ఇక బండి కదులుతుంది గదా, కదిలితే ఎంతలోకి పోతుంది అనుకొని న్యూసుపేపరు విప్పి చూస్తున్నాను. ఇంతలోనే మా ముందుపెట్టేలోని వాళ్ళంతా గబగబ దిగుతున్నారు. ఏమిటి ఇంతలోకే ఏమి ఉపద్రవం వచ్చినదని చూస్తుంటే డ్రైవరు పెట్టె పెట్టె దగ్గరకూ వచ్చి "దిగండయ్యా కదిలిం తరువాత ఎక్కొచ్చుకాని దిగండి" అని అరుచుకుంటూ పెట్టెల వెంట పరుగెత్తినాడు. ఇదెక్కడి గోలరా అని విసుక్కొని మేమంతా దిగి నుంచున్నాము. నేను "సామాను కూడా దింపాలా ఏమిటి" అన్నాను. డ్రైవరు ఏమి చెప్పకుండా వెళ్ళిపోయినాడు. ఇంజను దగ్గర ఇదంతా చూస్తున్న ఒక పెద్ద మనిషి "మొన్న మా వూరులో మోటారు ఇట్లానే కదలక డబడబ కొట్టుకొంటే మేమంతా కలిసి నెట్టితే చక్కగా పోయింది. చూస్తారేం? తలో చెయ్యి ఎయ్యండోయి" అన్నాడు.

ఇట్లా అంటూ ఉండగానే బండి అమాంతంగా మహావేగంతో కదిలింది. మేమంతా చప్పున బండిలో ఎక్కి కూర్చున్నాము. నేను ఎంత చెడ్డదైన రైలు బండి కదా ఇహ పోతుంది గంటకు నలభై మైళ్ళ వేగంతోటి అని అనుకొని సద్దుకు కూర్చుని పేపరులో మొదటి పంతి చదివేలోపల బండి టక్కున ఆగింది. మళ్ళీ ఏమొచ్చిందో, తిరిగి కదిలేసరికి ఎంత ప్రయత్నం కావాలో అని గుండెలు తల్లడిల్లి పోయినాయి. కొందరు ఎవరో తీగలాగారనీ ఎద్దు అడ్డం వచ్చినదని ముసలమ్మ బండి ఎక్కలేదనీ ఎవరికి తోచినట్లు వారన్నారు. ఇంకో ఆయన ముసలమ్మ కోసం బండి ఆగుతుందా అన్నారు.

దాని ధర్మానబండి మళ్ళీ దానంతటదే కదలి రైలు గేటుదాకా, రైలుబండి లాగా నడిచింది. గేటు దగరకు రాగానే వేగం అంతా పోయి మెల్లగా నడవటం మొదలుపెట్టింది. మళ్ళీ ఆగుతుందేమోరా బాబూ అని అనుకొన్నాను.

సరే దేవుడిమీద భారంవేసి గుండె రాయి చేసుకొని కూర్చున్నాను. దాని ధర్మాన అది ఆగక అలాగే ముసలి నడక నడిచింది. బ్రిడ్జి మరమ్మత్తులో ఉండటంవల్ల

అలా నడిచింది గాని మరేమీ ప్రమాదం లేదని చెప్పారు. నాకు కాస్త మనశ్శాంతి అయింది. అక్కడ నుండి దుర్గగుడి కనిపిస్తున్నది. బండి సక్రమంగా గుంటూరు నడిపించు తల్లీ అని మొక్కుకున్నాను. వంతెన దాటి ఒక అర ఫర్లాంగు దూరం వరకు బండి చురుకుగా నడిచింది. మళ్లీ నడక చప్పున మందగించింది.

అక్కడ కూలీలు రోడ్డు బాగుచేస్తున్నారు. వాళ్లు బండివస్తున్నదని తప్పుకోవటానికి బదులు బండి ఆపమని డ్రైవరును కేకేశారు. ఎందుకు అన్నాడు డ్రైవరు. వాళ్లు "మేకులు బిగిస్తున్నాము. ఇదికానీ తోల్దుకాని" అన్నారు.

"ఏమోయి రైలు బండి అనుకున్నావా మరేమనుకొన్నావు"

"ఓసీ మాకు తెలుసు లేవయ్యా గుంటూరు బండి"

"లే! దార్లో, లేవండ్రా, బండి మీదుగా తోలేస్తాను సుమా!

ఓసి మాకు చెప్పవచ్చావు. లేవయ్యా, మొన్న గేటు దగ్గర రైలుక్రింద కుక్కబడితే బండి ఆగిపోలేదా! మేము నలుగురము నాలుగుచేతులు వేస్తే బండి యాడికి కదులుతుంది అన్నారు. ఇక డ్రైవరు లాభము లేదు. అనుకొని అరే లేవండ్రా బండి ఆపటానికి వీలులేదు. ఆగిందా అంటే మళ్ళీ కదలదు. మీకు మాకూ పనినష్టం. వచ్చేటప్పుడు దోసకాయలు యిస్తాలే అని బతిమలాడుకొన్నాడు. వాళ్లు దయదల్చి తొలిగారు. మళ్లీ బండిసాగి కృష్ణవంతెనను సమీపించింది. మరో నిమిషంలో కృష్ణవంతెనలోకి ప్రవేశించింది.

కృష్ణానది నురుగులు కక్కుతూ కిందుగా ప్రవహిస్తున్నది. ఇంత ప్రవాహాన్ని సహితం లెక్కజేయను చూచారా అని విజయభేరిని మోగించినట్లు పెద్దగా రైలు కూతపెట్టింది. ఇంతలో తాడేపల్లి స్టేషనుకు సమీపంలోకి వచ్చాము. నడక మందగించింది. ప్రతి బండి వస్తున్నప్పుడు అది నిరభ్యంతరంగా రావచ్చునని తెలుపటానికి చక్క వంచే ఆచారం ఉన్నది. ఈ బండి వస్తున్నదని తెలిసినా తాడేపల్లి స్టేషను మాస్టరు పనిలో ఉండటంచేత కాబోలు ఆ చక్క వంచలేదు, పోర్టరు అయ్యా చక్క వంచాలండి" అన్నాడు. సరేలే! ముందు యీ పని చెయ్యి దానికేం అదే వస్తుంది. చక్క వంచకపోతే మట్టుకు రాకూడదా ఇక్కడ ఏమి అడ్డం ఉన్నదని దానికా బెట్టు" అని అతడు అన్నాడట. మాకీ విషయము తరువాత తెలిసింది.

ఇక్కడ మా బండి షడ్జమ స్వరములో అరిచి విసిగి కేకేస్తే అందుతుందేమో అని శక్తి అంతా వినియోగించి కేక వేసినా లాభంలేక పోవటంవల్ల డ్రైవరు తను స్వయంగా వెళ్లి చక్కవంచుకో వలెనని తలంపుతో బయలుదేరాడు. ఒక కూరల కావడివాడు, ఆ వైపు వెళ్లటం చూచి వాడ్ని పిలిచి "నాయనా గుంటూరు బండివచ్చి కూచున్నది. చక్క వంచమని చెప్పుదూ" అన్నారు డ్రైవరు. వాడు ఆ మాత్రానికే కోపం తెచ్చుకొని "ఏమిటయ్యా ఇదేపని అనుకున్నావా నాకు. ప్రతి బండి వచ్చిందని మేము చెబుతుంటామా! మొన్న ఏదో పాపం అని చెప్పాను. ఎప్పుడూ అదేపనా!" అని గట్టిగా అనేసి కావడిబద్ద జుయ్ జుయ్ అని ఊపుకుంటూ వెళ్లిపోయినాడు. అక్కడికి స్టేషనుకు అరమైలు దూరములో ఉంది. డ్రైవరు పాపం బిక్కమొఖం వేశాడు. ఏం చేస్తాడు. పాపం ఏంచెయ్యను తోచనపుడు. అక్కడికి చక్క స్థంభం రెండువందల గజాల దూరంలో వుంది. మళ్లీ ఆలోచించకుండా యకాయకీ స్థంభం దగ్గరకెళ్లి, ఎక్కి చక్కవంచి చేత్తో పట్టుకొని బండి తీసుకొని రమ్మని ఇంజనులో వాళ్ళను కేకేశాడు.

అక్కడ ఇంజనులో నిప్పుతోసేవాడు డ్రైవరు పీఠాధికారి అయినాడు. ఈనవీన పీఠాధిపతి తనఠీవి నంతా చూపిస్తూ ఆ పీఠంమీద కూర్చుని ఛాతి విరిచి మా వంక చూశాడు. మేమూ ఆదర భావంతో చిరునవ్వు నవ్వాము. కాని అతని ఠీవికి భంగం కలిగే సమయం వచ్చింది. ఆ పీఠంమీద కూర్చోవచ్చుననుకొన్నాడు. కాని బండి నడపవలసి వస్తుందని అతడు కలలో నయినా అనుకోలేదు. కాని ఇప్పుడు ఆ పని చేయక తప్పిందికాదు. సరే యీ మాత్రం పనిచేయలేకపోతానా అని మరల దగ్గరకు వెళ్లి ఆలోచించగా ఏ మర తిప్పితే బండి కదులుతుందో తోచలేదు. సరిగదా పైగా ఏం ముట్టుకుంటే ఏమి ప్రాణంమీదికొస్తుందో అని అతనికి భయం వేసింది. అయినా చూద్దామని ఒకటి రెండు తిప్పాడు. కాని లాభం లేకపోయింది. అపుడు అతని బుద్ధిలో ఒక ఆలోచన మెఱుపులాగ మెరిసింది. చప్పున అతడు ఉన్న మరలన్నీ వరసబెట్టి సొంతంగా తిప్పేశాడు.

అసలు రైలుబండికి ఓ ఆచారమున్నది. ఆచారబద్ధమయిన జీవితము గడిపే ప్రాణకోటిలో రైలు ఒకటి. అది దాని ఆచారాలలో ఒక దానికైనా లోటు లేకుండ ఎండనక వాననక నిర్వర్తించుకొంటుంది. అటువంటి ఆచారాలు ఒకటి. బండిముందు

మెల్లగా కదలి క్రమంగా వేగం వృద్ధిచేసుకోటం. ఇప్పుడు బండి కదిలీ కదలటంతోనే యాభై మైళ్ల వేగంతో కదిలినందు వలన బండ్లలో వాళ్లంతా ఆ కదులుటకు మొగాళ్ల మీద ఆడవాళ్ళు ఆడవాళ్లు మీద మొగాళ్ళు పడ్డారు.

అక్కడ ఇంజనులో అన్ని మరలు తిప్పటంవల్ల వేడినీళ్లు చల్లనీళ్ళు ఆవిరి వేటిదారిని అవి స్వేచ్ఛగా పోయినాయి. క్రొత్త డ్రైవరు మట్టుకు కోరమీసం తిప్పుకొంటూ కొరవి దయ్యంతో కూర్చొని "చూచుకోండి నేనడిపితే బండి ఎల్లా పోతున్నదో" అని అర్థం వచ్చే నవ్వునవ్వాడు.

ఇంతలో బండి చక్కస్థంభాన్ని సమీపించింది. అక్కడ ఉన్న డ్రైవరు ఎక్కటానికి వీలులేనంత వేగంతో బండి వెళ్లటం చూచి ఒరే నీకేమి తెగులు వచ్చింది. నేనెల్లా ఎక్కటం అని అరచినాడు. "ఆపటానికి నా తరమా రైలుబండి మాటిమాటికి ఆగుతుందా" అని ఇతను మీసం మెలేశాడు. పాపం డ్రైవరు విచారగ్రస్థుడైనాడు. ఎంత కఠినుడైనా అప్పుడతనిని జూస్తే జాలిపడక మానదు. అట్లు అతడు పదవీచ్యుతుడై పైపెచ్చు పరాభవింపబడెను గాని ఏమి కాలవైపరీత్యము? నా ప్రక్కనున్న శాస్త్రిగారు అన్నాడు.

ఇక బండి సంగతి చూద్దాం. బండి భయంకర రూపము ధరించి రయ్యిన పోతున్నది. స్టేషనునూ ఎర్రజెండాను సహితం ధిక్కరించి అక్కడ ఆగేదేమిటి అనుకొని వెళ్లిపోయింది. స్టేషను దాటి అర ఫర్లాంగు దూరం పోయిన తరువాత ఆవిరి అంతా పోవటం చేత బండి దానంతటదీ అప్రయత్నంగా ఆగిపోయింది.

స్టేషను మాస్టరు బండి దగ్గరకు పరుగెత్తి ఈ విపరీత చర్యకు డ్రైవరు లేకపోవటానికి కారణం ఏమిటని అడిగాడు. చక్క వంగకపోవటం, డ్రైవరు స్వయంగా వెళ్లటం, బండి తను నడిపే సరికి అది తన స్వాధీనంలో నుంచి తప్పిపోవటంగల కథంతా సవిస్తరంగా విప్పి చెప్పాడు. వాళ్లు కడుపులు పట్టుకొని నవ్వారు. వాళ్లకు గార్డు అయినా బ్రేకు వెయ్యకపోయినాడా అని సందేహం కలిగింది. అంత గార్డు పెట్టె దగ్గరకు వెళ్లేసరికి అతను గాఢనిద్రా పరవశుడై ఉన్నాడు. ఇంత ప్రమాదం జరుగుతూ ఉండే సమయంలో ఇతడు నిద్రావస్థలో ఉండటం మరీ విపరీతంగా ఉంది. వాళ్లంతా అతనిని లేపినారు 'స్టేషను మాస్టరు ఏమయ్యా?' ఇంతగోల జరుగుతుంటే నిద్రపోతున్నావ్

అని కోపంతో అన్నాడు. అతడు శాంతంగా రాత్రీ... రామ విలాస సభవారు 'ప్రతాపరుద్రీయం' వేశారు. మన రైలు వాళ్లకు టిక్కెట్లు యిచ్చారు. అందుకని రాత్రి నిద్రలేదు అన్నాడు. స్టేషన్ మాస్టరు ఆశ్చర్యపడి మన గుంటూరు రైలు వాండ్లకు కూడా టిక్కట్లు ఊరకే యిచ్చారా? అన్నాడు.

"అంటే ఒక సందర్భం వచ్చింది. పెద్దబండి వాళ్లు కొంతమంది చాలాసార్లు చూడటంచేత రానందువల్ల మనబండి వాళ్లకు యియ్యటానికి అవకాశం కలిగింది" అన్నాడు గార్డు. "అల్లా చెప్పు, చెట్టులేనిచోట ఆముదపు మొక్క వృక్షమైంది అన్నమాట. లేకపోతే మనకివ్వ వచ్చారు! సరే బాగానే ఉంది? కాని నీవు మెలుకువతో నుండి బ్రేకు వేసినట్లయితే ఇంత అపాయం లేకపోయేది సుమా!" అన్నాడు మాస్టారు. ఆ మాట విని గార్డు ముఖం చిట్లించుకొని "ఏడ్చింది లెద్దూ ఇదివరకు వేసినప్పుడల్లా ఆగిందీ! ఏమిటో భ్రమ!" అని అన్నాడు. అక్కడ వున్న వాళ్లందరమూ కాసేపు నవ్వుకున్నాము ఆ మాటలువిని.

ఇంజనులో ఆవిరంతా పోవటంచేత అది నడవనంటే నడవనన్నది. అప్పుడు ఏమిటి చెయ్యటం, ఎవరికి ఏమి తోచింది కాదు. ఒకడు డి.టి.యస్.కు వైరు యివ్వమన్నాడు! వెంటనే తంతి పంపినారు. ఆయన మా తెలివికి సంతోషించాడు! క్రొత్త ఇంజను పెట్టి బండి నడపండి అని జవాబు పంపినాడు. అరెరె ఈ మాత్రం మనకు తోచక పోయనే అని అక్కడున్న బుద్ధిమంతులంతా నాలిక కొరుక్కున్నారు!

కొత్త ఇంజను వచ్చిన తరువాత బండి కదిలింది. నాకప్పటికి పూర్తిగా విసుకెత్తింది. క్రొత్త ఇంజనుతో సక్రమముగానే నడిచింది బండి చాలాసేపు. కాని మంగళగిరి సమీపంలో ఈ ధూమశకటం తన నిజస్వరూపం దాల్చి మందగమనము అవలంబించింది. మళ్లీ ఏం రోగం వచ్చిందా అని కిటికీలోనుంచి తొంగి చూచాను. అప్పటికే గేటులోనున్న మనిషితో తీవ్రమైన వాదంలోకి దిగాడు మా డ్రైవరు. గేటు వెయ్యలేదు, రెండెడ్లబండ్లు రైలు పట్టాలమీదుగా నిర్భయంగా నడుస్తున్నవి. నాకు పెద్ద సంశయము వచ్చింది. రైలును చూసి బండ్లు ఆగుతవా? కాక బండ్లకోసం రైలు ఆగుతుందా? అని. అయినా యీ బండి మామూలు ఏమిటి అని కిటికీలోనుంచి బయటికి చూసి చాలా ఆశ్చర్యం వేసి ఏమిటయ్యా అన్నాను. "ఆ వెధవ గేటు

వెయ్యడు చూడండి రైలు పోనిస్తే ఎడ్లు చస్తవి" అన్నాడు డ్రైవరు. గేటువాడు కోపంతో "ముష్టికొచ్చినా నీటు తగ్గరు మా గుంటూరు డ్రైవర్లకు. ఎడ్లు చస్తయ్యట. బండి ఆగకపోతే అదే పదివేలు. కాసేపు ఉండు. నీకు నాకు తొందరేమిటి. ఈ పత్తిబండ్లు బోని, చెరొక సవాశేరు గిట్టుతుంది" అన్నాడు. డ్రైవరు బండిని అట పోనీయటానికి ఇష్టంలేక ఇటు పౌరుషహీనంగా ఆపటానికి ఇష్టంలేక ఏదో ఒక మోస్తరు సంసారపక్షంగా బండిని నడిపించాడు. కాని ఎంతసేపటికి ఆ బండ్లు పోవటం కాలేదు. అవీ తాపీగా నడుస్తున్నవి. అందుచేత తప్పనిసరిగా రైలుబండిని ఆపి ఆ ఎద్దుబండ్లు అన్నీ పోయేంతవరకు దిగాలపడి చూస్తూ నిల్చున్నాడు. మరికొంతసేపటికి దోవ తెరిపి అయింది. కాని రైలును కదపటం వీడితరమా! భగీరథ ప్రయత్నాలు చేశాడు కాని కదిలింది కాదు. మన ప్రయత్నాలు ఫలిస్తాయా. మనవాళ్లు చెప్పినట్లు దేనికైనా దాని ఘడియ రావాలే. కొంతమంది పిల్లలు ఎన్ని సంవత్సరాలయినా ఒకటే క్లాసులో ఉంటారు. మాస్టర్లు వాళ్లను పై క్లాసులోకి ఎల్లాగయినా నెడదామని ఎన్ని ప్రయత్నాలు చేసినా వాళ్లు కదలరు. ఏనాలుగేండ్లకో దాని ఘడియొస్తే సరి. టక్కున పైక్లాసులోకి పోతారు.అల్లాగే డ్రైవరు చేసిన ప్రయత్నాలు లాభించలేదు. కూతకూసిన వెంటనే కదలటం ఇంజనులకు సాధారణమైన ఆచారం. కాబట్టి కూత వేయించిన తరువాత కదలకపోతే పదిమంది ఏమైనా అనుకొని పోతారని భయపడి అయినా కదులుతుందేమో అని భారం అంతా ఇంజనుమీద పారేసి కూతకూయించాడు. అప్పటికి చలనంలేదు. డ్రైవరు మరమట్టుకు తిప్పేసి తన స్థానంలో తాను కూర్చున్నాడు. దానియిష్టం వచ్చినప్పుడు అది కదలనీయమని. రవంత సేపులో దాని ధర్మాన అది కదిలింది. ఆ డ్రైవరు బెజవాడ దగ్గరే కొంచెం ఓపిక చేసుకొని ఏ బ్రాహ్మణి చేతనో కాస్త పంచాంగం చూపించుకొని వర్జంలేని ఘడియలలో బయలుదేరినట్లయితే వాడికి మాకు యింత శ్రమ లేకపోయేది. ఇరవై మైళ్ల ప్రయాణానికి ఇన్ని తిప్పలా?

కంపినీవాళ్లు అక్కడక్కడ కాఫీ హెూటళ్లు అయినా పెట్టిస్తే బాగుండేది. మధ్య మధ్య దిగి కాస్త కాఫీ అయినా తాగి కూర్చునేవాళ్లం మరి. కొంచెం సేపట్లో బండి మంగళగిరి చేరింది.

బెజవాడ అమ్మవారికి ఇదివరలో మొక్కుకొన్నాను. కాని ఏమి పని జేసినట్లు

కనబడలేదు. అక్కడికి నరసింహస్వామి కోవెల గోపురము దానిపైనున్న బంగారపు శిఖరములు కనిపిస్తున్నవి. లేత ఎండలో అవి తళ తళ లాడుతున్నవి. నరసింహస్వామికి కొంతమంది దండాలు పెట్టారు. కొండపైనున్న పానకాలరాయుడు అంతకంటే సత్యంగల దేవుడని ఆయనకు కొందరు ముడుపులు గడుతున్నారు. నేను గూడా కళ్లు మూసుకొన్నాను. ఏం మొక్కుకుందామా అనుకొని పానకాలరాయుడిని మనస్సులో తల్చుకొని "స్వామీ! ఈ తడవ జట్కా కట్టించుకు వచ్చి అయినా నీ మొక్కు చెల్లించుకుంటాను. గుంటూరుకు చేర్చు నాయనా అని మాకు పైని కోటప్ప ఉండటం వల్ల ఆయనను తల్చుకొని మనసార నమస్కారం చేసి చేరుకో కోటప్పా చేరుకో అని ప్రార్థించాను". ఇంతలో బండి మళ్లీ కదిలింది.

అప్పుడు ఎందుకో స్టేషను మాస్టరు ఎఱ్ఱజెండా ఊపాడు. పానకాలరాయుడి ప్రభావంవల్ల కామాలు ఎఱ్ఱజెండాను ఏమాత్రం లెక్కజేయక మాస్టరు జండా బలంకొద్దీ విసురుతూ ఆగమని కొట్టుకొంటున్నా వినక బండి నడవసాగింది. రైలు రోడ్లకు రెండువైపుల మెట్టపైరు పండి బరువువల్ల నేలకు వంగి ఉంది. ఆ పచ్చని పొలాల్లో బంతిపూలు మధ్యమధ్య విరియపూచి మనోహరంగా ఉన్నవి. అక్కడక్కడ పచ్చికబీళ్లలో మేస్తున్న పశువులు రైలును చూచి బెదిరి చెంగున గంతులేస్తున్నవి.

కాపు పడుచులు నేతి దుత్తలను ఒకదానిపైన మరొకటి పెట్టుకొని ఏలపాటలు పాడుతూ కొందరు, ఊరికే మాట్లాడుకుంటూ కొందరూ, నవ్వుకొంటూ కాలిదారిని నడుస్తున్నారు. ఆ పొలాలలో ఉన్న ఒక కాపు ఒక కఱ్ఱకు చివర వంకాయలు, గోంగూర, మొక్కజొన్నకండెలు కట్టి డ్రైవరుకు అందించినాడు. అతను అవి పుచ్చుకొని రెండు నిప్పుకణికలు గిరాటు పెట్టాడు. ఈ ఇచ్చిపుచ్చు కోతలకు బండి యొక్క వేగం ఏమి అడ్డురాలేదు.

అటు తరువాత బండి మటుకు బాగానే నడిచింది పాపం! ఏమాట కామాటే చెప్పాలె. మా పెట్టెలో ఒక అతను రైలు బండిలాగ నడుస్తుందిరా? అన్నాడు. ఇంకోడు రైలుబండేంటోయ్ పిట్ట! లాగెగిరిపోతుంటే అన్నాడు. పాపం ఆ కాస్త వీళ్ల ప్రాణానికి మహావేగంలా ఉంది కాబోలు మంగళగిరిలో ఎక్కిన పెద్దమనిషి ఒకాయన నాముందు కూర్చున్నాడు. అతనికి మీసాలు ఉన్నవి. గడ్డం మాసింది. పట్టెవర్ధనాలు పదిలంగా

దిద్ది గండభేరుండ అంచుకండువా పైన వేసుకొన్నాడు.

"అయ్యా మీదేవూరు!"

'మాది తిరువూరండి!'

'ఎక్కడండి ఆ వూరు!'

'ఎల్లుపాలెం దగ్గిరండీ!'

'తిరువూరు గంపలగూడెమా ఏమిటండి!'

'అవును'

'మీరెవరి కుమార్లు!'

'నాగేశ్వరరావుగారి'

'మీ ఇంటి పేరు!'

'పుల్లంరాజువారు!'

'అయితే బాబు మీకునూ మాచిరాజు వారికిని సంబంధ బాంధవ్యాలు ఉన్నయా అండి!'

'ఇవన్నీ ఈయనకెందుకో అనుకొని అయినా పెద్దవాడు పోనీ అని ఉన్నాయండీ' అన్నాను. అంతటితో పోనీయక మళ్లీ ఆయన.

'అయితే మీరెంతమంది బిడ్డలు?'

'ముగ్గురము'

'ఆడపిల్లలెంతమంది మొగపిల్లలెంతమంది?'

ఇక ఆడపిల్లల పెండ్లి అయినసంగతి, వాళ్ళను ఏవూరు యిచ్చిందీ, వాళ్ళకు సంతానం ఎంతమంది అయిందీ, నా సంతానం ఎంతమందో, మొదటినుంచి చివరివరకు అడగక మానడని ఆ విషయం మార్చాలని, బాబూ, ఈ గుంటూరు బండి ఇంత మెల్లిగా నడుస్తుందేమండి" అన్నాను.

ఆయన అసలు వసతాగిన బిడ్డ. నోరు ఊరుకోదు. ఆ మాత్రం అవకాశం తీసుకొని ఆయన లెక్చరు ఆరంభించాడు. నేను విస్తారము మాట్లాడక ఊ అన్నాను.

"ఈ గుంటూరు బండి అసలు పూర్వం బాగా పోయేది. ఈ మధ్య ఒక బ్రాహ్మణుడు శాపం యిచ్చినందువల్ల దానికీ గతి పట్టింది. ఒక మాటు ఒక కాపు పెద్ద మనిషికి ఓ సందేహం కలిగింది. అంతా గుంటూరు బండిని వేళాకోళం చేస్తారు. ఇది మటుకు రైలు కాదా? ఆగమన్న చోటల్లా తటాలున ఆగుతుందా అని వేగంగా పోతున్న బండిని "బండి ఆపు బండి ఆపుమని" కేకేశాడు. డ్రైవరు ఠక్కున బండాపి ఎందుకయ్యా అన్నాడట. అతనికి ఏమి తోచింది కాదు, ఆగమంటే ఆగివచ్చిందా అని నవ్వుటాలకు కేకవేస్తే నిజంగా ఆగింది. ఏమి తోచక నిలుచున్న పాటున నిలువబడిపోయి ఆలోచించాడట. చిన్నతనంలో చదువుకొన్న కథ ఒకటి జ్ఞాపకం వచ్చింది: ఒకడు కట్టెలు కొట్టుకొని అవి అమ్ముకొని జీవిస్తూ ఉండేవాడు. రోజూ కట్టెలు కొట్టుకోవటం అమ్ముకోవటం అతనికి బహు కష్టముగా ఉండేది. ఒకరోజు అడవి అంతా తిరిగి బహు ప్రయాసపడి ఎండు కట్టెలు కొట్టుకొని మోపు గట్టుకొని తన జీవితం తనకే భారం అనిపించి ఒకమారు కళ్లు మూసుకొని భగవంతుడికి నామీద కరుణ లేదాయే - ఈ బ్రతుకు బ్రతికే కంటే చస్తే మేలు, చావైనా వస్తే బాగుండును అనుకొన్నాడు. కళ్లు తెరిచేసరికి వాని కళ్లెదుట మృత్యుదేవత నిలబడి "ఎందుకు పిల్చావు" అన్నది. వాడు నిర్ఘాంతపోయి ఎవరు నీవు నేనెవ్వరినీ ఇప్పుడు పిలవలేదే! అన్నాడు. ఎవ్వరిని పిలవలేదా! ఇప్పుడేకదా చావు వస్తే బాగుండుననుకున్నావు. నేనే చావును! అన్నది. వీడి గుండెలు కొట్టుకోవటం మానేసినవి. కాళ్లు చేతులు చల్లబడ్డవి. కాని తక్షణం తెప్పరిల్లి - ఓహో నీవేనా ఆ చల్లని తల్లివి. పిలవగానే వచ్చావు. ఎంత మంచిదానవు! అన్నాడు. ఎందుకు పిల్చావు? అని చావు అడిగింది. ఎబ్బే, ఎందుకులేదు. ఈ మోపు కాస్త ఎత్తిపో అని ఎత్తించుకుని తన దారిన పోయినాడట. అట్లాగే ఇతడు చప్పున తెప్పరిల్లి "ఎబ్బే ఏమీ లేదు, కాస్త చుట్టనిప్పు ఇస్తారా? అన్నాడు" అని చెప్పేసరికి మేమంతా విరగబడి నవ్వినాము". ఇది విన్నారా అని మళ్లీ మొదలుపెట్టాడు. ఒకమాట బండిపోతుంది. డ్రైవరు దూరాన ఒక ముసలమ్మ కనిపించింది. ఆమె పాపం కడు వృద్ధురాలు. దేహంఅంతా పండిపోయి ముడుతలు పడ్డది. వృద్ధాప్యంచేత వొంగిపోయి చేతి కఱ్ఱ సాయంచేత నడుస్తున్నది. ఎండ పైన మాడుస్తుంటే ఈ మూడుకాళ్ల ముసలిది ఆ పొలాలలో పోతున్నది. క్రిందకాళ్లు పైన నెత్తి మాడుతున్నవి. ఆ ముసలిదాన్ని చూస్తే ఎవరికైనా గుండె

కరుగుతుంది. మన డ్రైవరు గుండె అసలే నిప్పుదగ్గర ఉండటంవల్ల కరిగి నీరై పోయింది. ఆయన పాపం బండిని ఆపి ముసలమ్మను పిలిచి "ముసలమ్మా నీవు పాపం చాలా ముసలిదానవు. నువ్వు నడవలేవు, పోనీలే ఈ బండెక్కు నిన్ను తీసుకెళ్లి గుంటూరులో వదిలేస్తాను, నాకేమి ఇవ్వ వద్దులే" అన్నాడు.

ముసలమ్మ చిరునవ్వు నవ్వి, "ఇంతమందిని చూచానుగాని నీ అంత మంచివాడిని నే జూడలేదు! రైలు ఉద్యోగస్తులలో నీ అంత మంచివాడుండటం అరుదు. నీ హృదయం చాలా మంచిది; ఎక్కటానికి ఏమీ అభ్యంతరం లేదు. కాని గుంటూరులో కొంచెం తొందర పని ఉండటంవల్ల ఎక్కటానికి వీలులేదు. మనస్సులో కోపం ఉంచుకోకు ఇంకోమాటు తప్పక ఎక్కుతాను. అని చెప్పింది" అన్నాడు మేమంతా చాలాసేపు నవ్వినాము.

మరోమాటు ఒక ముసలమ్మ తన మనుమడ్ని వెంటబెట్టుకుని గుంటూరు వచ్చింది. గేటులో టిక్కెట్టు తీసుకునే ఆయన ఈ కుర్రవాడికి అర టికెట్టు తీసుకొన్నావేం? నిండు టిక్కెట్టు కొనేటంత పెద్దవాడేనే అన్నాడు. ఆమె ఏమీ మాట్లాడలేదు. అక్కడ ఉన్నవాళ్లంతా పోనీలే పెద్దది ఏదో తెలియక జేసింది. అలా అన్నారు. వాడు పోనియ్యక పెద్ద కుర్రాళ్లు కూడా అర టిక్కెట్టు పుచ్చుకొంటె కంపినీ ఏమి బాగుపడుతుంది. సరేలే రెండింతలు పైకం కట్టు అని నిలిపేశాడు. అప్పుడా ముసలమ్మ కళ్ళెర్రజేసి, ఏమయ్యా, ఏం జేస్తావో చెయ్యి, ఎక్కేటప్పుడు మా వాడు చిన్నవాడే అన్నది."

అని చెప్పేసరికి మా బండిలో వాళ్లంత విరగబడి నవ్వినారు. ముసలమ్మ చాలా తెలివిగలదని టికెట్ కలెక్టరును బాగా మాడ్చిందని అన్నారు. పక్క బండిలో వాళ్లంతా మా బండిలో ఏదో హడావుడి జరుగుతున్నదని తొంగి చేశారు. ఇంతలోకే నంబూరు స్టేషను వచ్చింది. అక్కడ ఆయన దిగిపోయినాడు. నంబూరులో ఎక్కేజనం ఎక్కుతుండగానే ఒకాయన తనిఖీకి వచ్చాడు. ప్రక్క బండిలోనుండి మా బండిలో ప్రవేశించి టికెట్టు అని తన చేత్తో ఉన్న కత్తెర టక్ టక్ మని కొట్టాడు. నేను మొదట కూర్చున్నాను. కాబట్టి చప్పున జేబులో నుంచి టిక్కెట్టు తీసి చూపాను. తరువాత నా ప్రక్కనున్న పల్నాడు పెద్ద మనిషి ముందు బొడ్డులో వెతికి కనిపించకపోతే తలగుడ్డ

మడతలోనుంచి తీసి యిచ్చాడు. తరువాత ఒక్కొక్కడినీ టిక్కట్టు అడిగాడు. అందరూ చూపించారు.

మా పెట్టెలో చెక్కమీద ఒక స్కూలు కుర్రాడు పడుకొన్నాడు. అంతకుముందు మాతో ఏమేమిటో కబుర్లు చెబుతున్న కుర్రవాడు టికెట్టు కలెక్టరును చూచే చూడటంతోనే అమాంతం నిద్రపోయినాడు. టికట్ కలెక్టరు కత్తెరతో ఠాక్ ఠాక్ మని కొట్టినా అతని గాఢ నిద్రకే ఏమి భంగం కలుగలేదు. పైపెచ్చు అతడు గుఱక పెట్టడం ఆరంభించాడు. పగలు పదిగంటలకు ఆ నిద్ర! టిక్కట్ కలెక్టరు అతని దగ్గరకు వెళ్లి ఏమండోయి టిక్కెట్టు అని అరుస్తు తన దగ్గర ఉన్న కత్తెరతో ఆ తలుపు చెక్కలమీద ఠకఠక కొట్టినా మన విద్యార్థికి ఏమాత్రం మెళుకవ రాలేదు సరిగదా. పైగా ముసుగు బిగించాడు. టిక్కెట్టు కలెక్టరు ముఖంమీద గుడ్డ తొలగించటానికి కొంచెం ప్రయత్నం చేయగా నిద్రాభంగం అయిన వాడివలె అతడు అబ్బ అని చెయ్యి యాడించాడు. ఆ చెయ్యి ఆ అరవ టికెట్టు కలెక్టరు చెంపమీద తగిలింది.

తలదగ్గర ఉంటే చెయ్యి విసుర్లు తగలక మానవుని అతడు కాళ్లకేసి వచ్చి"ఏమయ్యా నీవు లెయ్యి టికెట్టు చూపువయ్యా" అన్నాడు. నిద్రాభంగం కలగటం వల్ల కాబోలు ఆ విద్యార్థి కాళ్ళుసాచి విదిలించాడు.

ఈ పెంకెతనం జూచి వాడు ఈతనిని వదలక ఒకటే విధంగా చెక్కమీద కొట్టడం ప్రారంభించాడు. విద్యార్థి కళ్ళు నులుపుకుంటూ లేచి ఏమిటీ జాతర? నిద్రపోనివ్వవా? అన్నాడు.

"టిక్కెట్టు సూపు"

"ఆలో వచ్చావ్ - అనుకుంటూనే వున్నా అప్పుడే వచ్చావు యముడిలాగ ఇస్తానుండు" అని జేబులో చేతులు పెట్టి చప్పునతీసి ఒక పాత టిక్కెట్టు అతని చేతిలో పెట్టాడు, వాడు అది తీసికొని "ఇదేమయ్యా ఎప్పటిది? ఇది పాతది అన్నాడు.

"పాత కొత్త లేటికి సువస్తువులకు"

"పుచ్చుకో అన్నాడు"

"ఏమయ్యా"

"అదేమిరోగం సరిగా మాట్లాడలేవు. ఎవరనుకున్నావు. జాగ్రత్త. మర్యాదగా మాట్లాడు లేకపోతే ఊరుకో. అరవవాడిని, ఏమండీ అనలేవు, పో, పో నిన్ను చూస్తెనే..."

"ఇది ఏమి కర్మమయ్యా! ఈ టిక్కట్టు పాతది తేవయ్యా."

"అదుగో మళ్ళీ ఏమయ్యా అంటావు. యిదుగో యీ తడవ గనుక అంటివా అంటే ... పడతయి సుమా. అరవవాడివి అందులో" అని తిట్టాలిసినవన్ని అనేసి, తన మనస్సు ఏదో పొరపాటున అది ఇచ్చినట్లూ అసలు టిక్కట్టు ఎక్కడో ఉన్నట్లు నటిస్తూ ఆహా! పొరపాటు ఉండు అని ఇంకో జేబులో చేయి పెట్టి వెతికి ఏదో ఇయ్యబోయి అరరే ఎక్కడో వుండాల వెధవముండా టిక్కట్టు సమయానికి కనిపించదు అని మళ్ళా వెతకడం ఆరంభించాడు.

అయ్యయ్యో - ఇదేమయ్యా నన్ను నిలిపేస్తావు. నాకేం పనిలేదా?

"మళ్లీ ఏమయ్యా అంటావు. సరే ఉండు. అరవ వాడా నా పెట్టెలో పెట్టానేమో చూడనీ" అని పెట్టె తీసి ఒక్కొక్క వస్తువే బైట పెడుతున్నాడు.

"ఇదేమి ధర్మమయ్యా అదంతా అయినదాకా నే నుండనా?"

"నీవు కొంటెగదయ్యా ఉంటానికి"

"మరి ఏమయ్యో అరవాయనా నీవు అలా మాట్లాడితే తగులుతవి తెలుసు నాకు."

"నిజం చెపితే నీకు కోపం, టికెట్ కొంటే కనపడకేం జేస్తుందీ"

"ఏమయ్యా అవసర పడతావు. ఇస్తానుదా" అని వాడి అరవ తెలుగులో వాడిని మాడ్చి, 'ఆ జ్ఞాపకం వచ్చింది మా స్నేహితుడి దగ్గరనుండి ఇప్పిస్తానురా. అని మా పెట్టెలో నుంచి తీసికెడుతూ మా వంకజూచి చిరునవ్వు నవ్వాడు. ఏదో తిప్పలు పెట్టడానికి తీసుకెడుతున్నాడని నేకూడా వాళ్లతో వెళ్ళాను. రెండుమూడు పెట్టెలు వెతికినట్లే వెతికి అతనిని పిలిచి "ఆ మరిచిపోయినా. ఈ మధ్య బొత్తిగా నాకు జ్ఞాపక

శక్తి పోయింది, అసలు టిక్కెట్ కొనడం మరచిపోయినాను!" అన్నాడు.

ఆ సంగతి నేను మొదలే చెప్పా, మరి డబ్బు కట్టు.

"ఎంత?"

'డబుల్ ఛార్జ్' (Double Charge)

"కడితే ఏమి లాభము. కంపెనీకి పోతుందా. అసలు డబ్బు చెరిసగం తీసుకుందాం."

"అల్లా వీలుపడదు. పెనాల్టీతో గూడ కట్టవలసిందే. నడుస్టేషన్ మాస్టరు దగ్గరికి.." ఓస్ ఆగుమరి. ఈ బెదిరింపులు అణగటానికి మందు నా దగ్గరుందిలే. ఇదో అని అతని చేతిలో రూపాయి పెట్టాడు, వెండిబిళ్ల స్పర్శ తగిలేసరికి అతడికి ముఖం చేటంత అయింది. పో బ్రదర్ పో గుంటూరులో నన్ను కలుసుకో గేటులో వాడితో చెప్పి పంపిస్తా అన్నాడు. బండి ఇంకా స్టేషనులో ఉంది. ఇద్దరు పల్లెటూరి వాళ్లు వెళ్లి ఆడవాళ్ల పెట్టెలో కూర్చున్నారు. పోర్టరు చూచి దిగండయ్యా యిది ఆడవాళ్ల బండి అన్నారు. "ఎందుకు దిగాల ఆడోళ్ళ బండి అయితే మటుకు, మొగోళ్లు ఎందుకు ఎక్కకూడదు. అయినా ఇవి మొగోళ్ల బండ్లు ఇవి ఆడోండ్ల బండ్లు అని వాటి మొగాన రాసి ఉన్నాయా" అని ఆరంభించాడు. అన్నిరకముల పెంకితనాలకు అమోఘంగా పనిచేసే ఎర్రతలగుడ్డను కనపర్చేసరికి వాళ్లు దిగిపోయినారు.

అప్పుడే ఒక పెద్ద వడ్రెగుంపు వచ్చింది. వాళ్ల తట్టలు బుట్టలు కోళ్ల గంపలు మొదలయిన సామానులతో తయారయి, ఎక్కటానికి సరైన బండి దొరక్క తటపటా యిస్తుండగా అందులో ఒకతె ఈటకు రండోస్ డబ్బా ఖాళీగా ఉంది అని కేకేసింది. వాళ్లంతా వెళ్లారు. అది పరుపులేసి ఉన్న బండి. ఎక్కటమా మానటమా అని ఆలోచిస్తూ ఉండగానే గార్డు పచ్చజెండా ఊపాడు. అంచేత ఇక ఆలస్యం చేస్తే లాభంలేదని సామానులు అందులోకి తోసి వాళ్లూ ఎక్కి కూర్చుని జిల్లేడు చుట్టలు వెలిగించారు. వీళ్ల సంగతి ఎవరూ చూడలేదు.

బండి కదిలింది. కాకాని చెరువు సమీపంలో కొంచెం దాహం తీర్చుకొని మళ్లీ నడక సాగించింది.

అటు తరువాత మాకో గాలివాన తగిలింది. ఎదురు గాలిలో ఆ రైలుబండి రొప్పుతూ క్షయరోగి లాగ ఎలాగో అతి ప్రయాసంమీద నడిచింది. చెప్పడం మరచిపోయినాను, పొగాకు దొర బంగళా దగ్గర ఆగి అక్కడ ఒకరిద్దరిని యెక్కించుకుంది. లాభసాటిబేరం, అది డ్రైవరుకు, ఫైరుమ్యానుకు చేరో పొగాకుకట్ట గిట్టింది.

ఆ బండిలోనే కొందరు స్కూలు కుర్రాళ్లు కనిపించి గుంటూరు సంగతి యీ మోస్తరుగా చెప్పారు. "గుంటూరు బావుల్లో నీళ్లు లేవు. అంటే కొన్ని బావుల్లో అసలే లేవు. మరికొన్ని బావులలో నీరు ఉంది లేంది భూతఅద్దాలతో పరీక్షించి తెలియజేయమని ఇంజనీర్లకు అర్జీలు వెళ్లినాయి. వాళ్లువచ్చి చూచి సాధారణ భూతఅద్దాలు పనిచేయడం లేదనీ ఇందుకోసం ఎక్కువ లీవరుగల అద్దాలు సీమనుంచి తెప్పిస్తున్నామని జవాబు ఇచ్చారట. ఒకరోజున నూతిలో ఒకాయనచేద వేశాడట. ఎంతసేపు చేదినా చేద పైకి తేలదు. అప్పుడు ఏమిటి చెప్మా. అని నిల్చున్నపాటున నిలబడి ఆలోచించగా నిజం నీటిబుడగలాగా మనస్సులో పొంగింది. ఆ సమయంలోనే అమెరికావాడు కూడా చేదవేసి ఉంటాడు. ఈ రెండు బొక్కెనలు లంకెవేసుకోవటం వల్ల కదలటంలేదని గ్రహించి, ఇంకా గట్టిగా లాగితే ఆ బొక్కెన తనతోపాటు అమెరికావాడ్ని కూడా లాక్కొస్తుంది. అప్పుడు వాళ్లంతా ఇండియాకు కొత్త మార్గం కనిపెట్టాం అని డాబులు కోసుకొని వచ్చి పడతారని యోచించి అంచేత ఆపళంగా వదిలేశాడు.

బంధువులు గుంటూరు వెడితే పళ్లెంలో నుంచొని కాళ్లు కడుక్కోమంటున్నారు. గంగాళంలో కూర్చోబెట్టి స్నానాలు చేయిస్తున్నారు!"

అతను చాలా కులాసా కుర్రవాడు. మా ప్రక్కనే ఒక పెద్దమనిషి కూర్చున్నాడు. ఆయనకు పైన ఉత్తరీయం లేదు. తలకుమట్టుకు పెద్ద తలగుడ్డ ఉంది, మరీ విపరీత విషయం ఏమిటంటే ఆయనకు స్థనములు లావై కొంచెము బరువై జారినవి. కొంతమందికి లావుగా ఉండే మనుష్యులకు అలా ఉంటవి. స్కూలు కుర్రాడు అవి చూచి తనలో తాను నవ్వుకొన్నాడు. ఇంతలో మందులు అమ్మేవాడు వచ్చి రోగాలకు ఒకటే మందు, అనుపాన భేదంతో సేవిస్తే అన్ని రోగాలు కుదురుతాయినిన్నీ కావాలంటే

ఇప్పుడే రుజువు ఇస్తాననీ ఏకదమ్మున లెక్చరు ఆరంభించాడు. మన కుర్రవాడు అయ్యా మీవద్ద ఆ మందేనా, ఇంకేమైనా మందులున్నాయా అండి అన్నాడు. ఇంకేమీ మందులు కావాలో చెప్పండి యిస్తాను అన్నాడు. అతడు ఎబ్బే అట్టే పెద్ద మందులు అక్కరలేదండి. 'క్షీరవర్ధని' రెండు సీసాలు కావలె. అది బాగా పనిచేస్తున్నట్టు కనిపిస్తుంది. అని ఆ పెద్ద మనిషి వక్షస్థలమును చూశాడు అటు దృష్టి నిలిపి, బాగా పని చేస్తుందండీ, క్షీరవర్ధనీ అని మళ్లీ అన్నాడు. బండిలో ఉన్నవాళ్లంతా దిగబడి నవ్వారు.

మన విద్యార్థి అంతటితో ఊరుకోక పోనిలేండి. ఆ మందు దొరక్కపోతే పోనీయండి. నాకూ చిన్న జబ్బు ఏర్పడ్డదండీ. మందు ఏమైనా మీ దగ్గర దొరకచ్చుననుకొని చెబుతున్నాను.

"చెప్పండి బాబూ. కావాలంటే ప్రత్యేకంగా మాట్లాడుతాము. తరువాత" అన్నాడు డాక్టర్.

"ఎబ్బే అవసరం లేదండీ. ఈ మధ్య మూడు నెలల నుంచీ సుమండీ నాకీ జబ్బు క్రిందటి సంవత్సరం పరీక్షల ముందే కనబడ్డది".

"అయ్యో పాపం... అన్న ఇష్టం"

"అన్న ఇష్టం ఎక్కువయింది. అన్నం, అన్నం కంటే ముందు పుట్టిన కాఫీ లోపలికి సక్రమంగానే వెడతాయి"

"ఆహా! అయితే నిద్రపట్టదు కాబోలు"

"అటువంటిది కాదండీ. రాత్రి ఎనిమిది గంటలకు పరుంటె ప్రొద్దున ఎనిమిది గంటలవరకు నిద్రే"

"దగ్గు అటువంటిది కాబోలు. దగ్గుకు మా వద్ద ఉన్న మందు అమోఘంగా పనిచేస్తుంది లెండి. క్షయ దగ్గు, ఉబ్బసము దగ్గు, పడిశెము దగ్గు మరేదగ్గు అయినా సరే అనుపాన భేదంతో పుచ్చుకొంటే మహా బాగా పనిచేస్తుంది."

ఎందుకు జెబుతారు మీకు ప్రయాసం. అదికానేకాదు.

"మరి ఏమిటో శెలవియ్యండీ"

"ఏముందండీ! పుస్తకం తెరిస్తే సరి"

"ఓహెూ కళ్లవెంట నీరు కారుతాయా అండీ"

ఈ మందునే చనుపాలలో రంగరించి కరిగాకా ఉపయోగిస్తే పనిచేస్తుంది. గుణం రెండురోజులలో కనిపించకపోతే కణిక పారెయ్యవచ్చును.

"అది కాదయ్యా పుస్తకం తెరిస్తే నిద్రవస్తుంది. చదువుకోవాలని ఏమాత్రం బుద్ధి పుట్టదు. ఫుట్‌బాల్ అయినా టెన్నిస్ అయినా ఆడుకోవాలంటే ఓపిక ఉంటుంది కాని పుస్తకం తెరిస్తే సరి నిద్రాదేవత పూనుతుంది. సినిమాకు వెళ్లినా చీట్లాడుతున్నా నిద్ర అసలు రాదు."

"అబ్బా ఇది, ఉపద్రవమైన జబ్బు"

"మరి సొంతం వినండీ, ఇప్పుడు మీరిచ్చిన నోటీసు కాయితం చూశానా అందులో ఒక్కొక్క రోగ లక్షణాలు చదువుతుంటే ఆ రోగాలన్నీ నాకున్నట్టు తోస్తుంది. నడుము నొప్పి అని చదవటంలోనే, నడుములో నొప్పి. క్షయ అని చదవటంతోనే గొంతులో దగ్గు, రక్తహీనం అని చదవగానే వంట్లో బలహీనత నాకు ఉన్నట్లు తోస్తుంది. ఇహ అమృతాంజనము డబ్బామీది రోగాలు నొప్పులు చదువుతున్నప్పుడు అవన్నీ నాకున్నట్లు నాకోసమే అమృతాంజనం కనిపెట్టినట్లు నాకు తోస్తుంది. అటువంటి సమయాలలో నేనే ఆసుపత్రిననీ వైద్య విద్యార్థులంతా ఇకనుంచీ నా దగ్గరకే వచ్చి Practice Study చేయాలని నా భ్రమ".

"ఇటువంటి రోగాలకండీ మంచి మందు ఒకచోట దొరుకుతుందండి"

"మీకు ఎట్లా తెలుసును"

"నేను చూచాను అండీ"

"అదెక్కడండీ,"

"విశాఖపట్నంలో పిచ్చి ఆసుపత్రి"

"ఆహా – చూచానన్నారు. తమరక్కడనుంచేనా రావటం"

అని అనేసరికి మా బండ్లో వాళ్లంతా విరగబడి నవ్వారు.

పుస్తకాలమ్మే వాడొచ్చి మహాకవి కాళ్లకూరి వారి పుస్తకాలలోని పద్యాలు చదివి కొన్ని పుస్తకాలు అమ్మినాడు. అతడే జింతాన్ మాత్రలు రోమనాశని మొదలయిన మందులు పుస్తకాలతో పాటు అమ్ముతాడు.

ఇంతలో మేమంతా హడలిపోయేలాగున బండి కూతవేసింది. మరికొంచెం సేపట్లో బండి పూర్తిగా ఆగింది. ఇదే సమయం అనుకొని గార్డు దిగి పరుగెత్తుకుంటూ పొలంలోకి పోయి నాలుగు పండుదోసకాయలు కోసికొని ఒకటి కొరుక్కుంటూ గబాగబా వచ్చి రైలు ఎక్కాడు. నేను రెండు తెచ్చుకొనే వాడినే ఆ సంగతి తెలిస్తే అని మా విద్యార్థి విచారపడ్డాడు.

ఇంతలో గుంటూరు సమీపించింది. అవతారప్పాడు గొల్లవాళ్లు వస్తున్నారు. వాళ్ళను జూచి కామాలు బండినడక మందగించింది. రైలుబండికి కూడా మన్మధవికారం ఉంటుంది కాబోలు. ముందు డ్రైవరు తర్వాత గార్డు వాళ్లతో సరసాలాడారు. వాళ్లు చిరునవ్వులు వీళ్లపై విసిరారు.

ఇంతలో గుంటూరు మరీ సమీపంలోకి వచ్చింది. ముందు కాలేజీ గోపురము కనిపించింది. చక్కస్థంభం పైన చెక్క సగంమాత్రం వంగింది. వంగటానికి ఇష్టంలేకపోయినా ఏదో బాగుండదని మోమాటముచేత వంగినట్లు వంగింది.

అటు తరువాత పల్లెపిల్లలు, కాపుపిల్లలు, రైలు వెంట పరుగెత్తారు. వాళ్లే ముందు వెడుతారేమో అని మాకు భయంవేసింది. రైలు డ్రైవరు పౌరుషానికి లోపం లేకుండా విసురుగా నడిపించి వాళ్లకంటే ముందు పోయినాడు. స్టేషను వచ్చింది. టికెట్టు కలెక్టరు మనదేశంవాడే. నల్లటివాడు. సెకండుక్లాసులోకి ఎక్కాడు. అక్కడ ఈ ఉప్పరదొరలు కనిపించారు. వాడు నవ్వుతూ Black beggars అన్నాడు. వాడిరంగు ఏమిటో!

ఉప్పర్లు దిగారు. వాళ్లనురెట్టింపు చార్జి యిచ్చుకోండి అన్నాడు. వాళ్లు "మమ్ములను మోసపుచ్చి డబ్బు తీసుకోవాలని చూస్తున్నావా? ఏదో ఒక పెట్టెలో ఎక్కాం? మరి అడనే సెప్పక పోయినావా? ఎక్కినప్పుడూ ఎందుకూరకున్నావు. మరి యిప్పుడు డబ్బుయాడది, యేం జేస్తావో జెయ్యి అన్నారు.

పిచ్చుకపై బ్రహ్మాస్త్రం అన్నట్లు వాళ్లమీద చర్చ నడపటం ఇష్టంలేక పొండిరా? అన్నాడు. వాళ్లకు జాతకఫలం రీత్యా గొప్ప వాహనయోగం ఉంది కాబోలు అనుకొన్నాం మేము. గుంటూరు వచ్చాము. ఒక మాట.

ఇది పూర్తిజేసిన తరువాత ఇది వ్రాసిన సంగతి గుంటూరుబండిలో తిరిగే గార్డులకు ఎలాగో తెలిసి వాళ్లు ఎలాగయినా యీ నింద బాపుకోవలెనని కాబోలు నేనున్న ఇంటిముందుగా బండి (నేను కట్టపక్కనే బ్రాడీపేటలో వున్నాలెండీ) వెళ్ళేటప్పుడు పెద్దగా విజిలు వేయించటం చాలా విసురుగా నడిపించటం మొదలయిన పనులు చేస్తున్నారు. నేను అది చూచి గుంటూరు బండి విషయములో నేను వ్రాసినదంతా అబద్ధమని నమ్మి ఆ వ్యాసమును ప్రచురించకుండా ఉంటానని వారు అభిప్రాయపడ్డారని వినికిడివలన తెలిసింది.

కాని ఆ మాత్రానికి నేను లోబడను. ఇక్కడ మా యింటిదగ్గర విసురుగా నడిస్తే మట్టుకు దాని నిజస్వరూపం. ఎవరికి తెలియదు. రెండోది వారు నామీద విరోధం పూని నేను కనిపిస్తే సరి, నన్ను ఝుడిపించటానికో లేక పరిహాసానికో విజిలు వేయిస్తున్నారు. నా మీదికి బండి విసురుగా నడిపిస్తున్నారు. ఇదేగాక వీరంతా కంపెనీపైవాళ్లకు వ్రాసి నన్ను గుంటూరు బండిలో ఎక్కనీయకుండా ఆర్డర్లు ప్యాసు చేయిస్తారని కూడా వదంతి పుట్టింది.

ఇటువంటి ఉపద్రవం నాకు రానున్నప్పటికిన్నీ సత్యము దాచకూడదనీ లోకోపకార నిమిత్తం దీనిని నేను ప్రచురిస్తున్నాను. అటువంటి యిబ్బందులు వచ్చినట్లయితే, పాఠకులు ఇదివరలో పై చూపబడిన మవాజిన యావనుమంది ఇదంతా నిజమని ఇందులో ఏమీ అబద్ధము లేదని సాక్ష్యం యివ్వటానికి సిద్ధంగా ఉండాలి.

(సుజాత మాసపత్రిక, సెప్టెంబర్ 1927)